సాక్షి
అనంతపురం
బుధవారం । 1 । నవంబర్ । 2023



చీనీ టన్ను రూ.22 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.22 వేలు పలికాయి.



టమాట కిలో రూ.21

అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.21, కనిష్టం రూ.6, సరాసరి రూ.16 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
34.7°/21.4°

జిల్లా అంతటా మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. వేకువజామున చలి వాతావరణం మొదలైంది. ఈశాన్యం దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

ఏపీలో వంద శాతం పింఛన్ పంపిణీ



మాట్లాడుతున్న ఎంపీ తలారి రంగయ్య

అనంతపురం కార్పొరేషన్: ఆంధ్రప్రదేశ్‌లో అర్హులైన ప్రతి ఒక్కరికీ వంద శాతం పింఛన్ పంపిణీ అవుతోందని ఎంపీ తలారి రంగయ్య పేర్కొన్నారు. మంగళవారం పార్లమెంట్ భవనంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా పింఛన్ల పంపిణీపై సమీక్ష నిర్వహించింది. ఈ సందర్భంగా స్టాండింగ్ కమిటీ సభ్యుడు, ఎంపీ తలారి రంగయ్య కేంద్రం దృష్టికి కొన్ని సమస్యలను తీసుకెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వాలతో పోల్చితే కేంద్రం పింఛన్ డబ్బులు తక్కువగా ఇస్తోందని, ఆ పింఛన్‌ను పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దేశంలో ట్రాన్స్‌జెండర్లకు మాత్రం పింఛన్లు ఇవ్వడం లేదని, ఇది సామాజికంగా వెనుకబడిన వారికి ఇబ్బంది మారిందన్నారు. ఇప్పటికీ ట్రాన్స్‌జెండర్లు యాచనతోనే జీవనోపాధి పొందుతున్నారన్నారు. ఏపీలో తమ ప్రభుత్వం ట్రాన్స్‌జెండర్లకు పింఛన్ అందిస్తోందని చెప్పారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌జెండర్ల పట్ల కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఆయన తప్పుబట్టారు.

3న గుంతకల్లులో ‘జగనన్నకు చెబుదాం’

అనంతపురం అర్బన్: జగనన్నకు చెబుదాం మండల స్థాయి కార్యక్రమాన్ని ఈ నెల 3న గుంతకల్లులో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ గౌతమి తెలిపారు. స్థానిక టీటీడీ కళ్యాణ మండపంలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి ‘జగనన్నకు చెబుదాం’, ‘స్పందన’ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు పాల్గొంటారన్నారు. గుంతకల్లు మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

పీహెచ్‌సీలో ప్రసవమైతే రూ.5వేల సాయం



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి

అనంతపురం మెడికల్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో ప్రసవమైన మహిళకు ఆరోగ్య ఆసరా కింద రూ.5వేలు సాయం అందిస్తామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) భ్రమరాంబదేవి తెలిపారు. పీహెచ్‌సీల్లో ప్రసవాల సంఖ్య పెరగాలని వైద్య సిబ్బందికి సూచించారు. మంగళవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో వైద్యాధికారులు, స్టాఫ్‌నర్సులు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లతో డీఎంహెచ్‌ఓ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రతి పీహెచ్‌సీల్లో ప్రసవాలు జరగాలన్నారు. కష్టతరమైన కేసులను మాత్రం దగ్గర్లోని ఏరియా, జిల్లా ఆస్పత్రులకు రెఫర్ చేయాలన్నారు. ఒక్కో ప్రసవానికి ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.8వేలు ఇన్సెంటివ్‌కు పీహెచ్‌సీ క్లెయిమ్ చేసుకోవాలన్నారు. ఆ డబ్బు వైద్యులు, సిబ్బంది, ఆస్పత్రి అభివృద్ధికి వినియోగించుకోవచ్చన్నారు. సమావేశంలో డీఐఓ డాక్టర్ యుగంధర్, ఆరోగ్యశ్రీ డీసీ డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, కార్యాలయ పరిపాలనాధికారి గిరిజా మనోహరరావు పాల్గొన్నారు.

నేటి నుంచి రేషన్ పంపిణీ




అనంతపురం అర్బన్: నవంబరు నెలకు సంబంధించి బుధవారం నుంచి బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తారని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ తెలిపారు. పౌష్టికమైన ఫోర్టిఫైడ్ బియ్యం ఉచితంగా అందిస్తారన్నారు. కార్డుదారు కోరిక మేరకు బియ్యం స్థానంలో కిలో నుంచి మూడు కిలోల వరకు రాగులను పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి వద్దకే వచ్చి బియ్యం, సరుకులు అందిస్తారని వెల్లడించారు.

లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించండి

అనంతపురం సెంట్రల్: ఆర్టీసీ రిటైర్డు ఉద్యోగులు 2024 సంవత్సరానికి సంబంధించి పీఎఫ్, ఆర్‌బీఎస్ పింఛన్లు పొందడానికి డిపో, బ్యాంక్ మేనేజర్లతో ధ్రువీకరిస్తూ నవంబర్ 30లోగా లైఫ్ (జీవించినట్లు) సర్టిఫికెట్లు అందజేయాలని ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి రామిరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు.

శోత్రియం.. హాంఫట్!

- అయ్యగార్లపల్లిలో భూమాయ..
- ఒకే కుటుంబంలోని వారికి వందల ఎకరాలకు పట్టాలు
- రైత్వారీ పట్టాలతో యథేచ్ఛగా క్రయ విక్రయాలు
- ఇళ్లు, రోడ్లు, కాలువ, వంకలను సైతం వదలని వైనం
- టీడీపీ హయాంలో విచ్చలవిడిగా పట్టాదారు పాసుపుస్తకాలు
- ‘శోత్రియం’ కుటుంబీకులుగా తప్పుదోవ పట్టించిన సుధాకర్‌శెట్టి





❐ ఇక్కడ కనిపిస్తున్న బీడు పొలం అయ్యగార్లపల్లిలోని సర్వే నంబర్ 173లోనిది. దీనిని సున్నపు గుట్టగా పిలుస్తారు. 16.43 ఎకరాల విస్తీర్ణం ఉంది. కరువు నెలకొన్నప్పుడు గ్రామంలోని పశువుల మేత కోసం సదరు భూమిని గ్రామస్తులు పూర్వం నుంచి బీడుగా వదిలారు. ఈ భూమిని గ్రామస్తులకు తెలియకుండానే సుధాకర్ శెట్టి అనే వ్యక్తి తన తల్లి కె.సుమిత్రమ్మ పేరున రైత్వారీ పట్టాగా చేసుకున్నాడు.



❐ ఇక్కడ కనిపిస్తున్నది ఎండిపోయిన నీటి కుంట సర్వే నంబరు 179–2 లోనిది. గ్రామస్తులు పూర్వం నుంచి పశువులకు నీరు తాగేందుకని సుమారు 4.67 ఎకరాల విస్తీర్ణాన్ని కుంట కోసం కేటాయించారు. వర్షాలకు కుంటలోకి చేరిన నీటితో పశువులు దాహం తీర్చుకుంటున్నాయి. ఈ నీటి కుంటను సైతం సుధాకర్‌శెట్టి తల్లి పేరిట రైత్వారీ పట్టా జారీ అయ్యింది.



❐ ఇక్కడ చర్చి కనిపిస్తున్న ప్రదేశం సర్వే నంబరు 172–1 లోనిది. సుమారు 3.16 ఎకరాలు ఉంది. ఈ ప్రాంతంలో ప్రస్తుతం వడ్డే, బోయ, మాల, బొమ్మలాట కులస్తులు సుమారు 70 మంది స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారు. వారికి తెలియకుండానే సుధాకర్‌శెట్టి అనంతపురానికి చెందిన తన బామ్మర్ది ఆదిమూలపు బాబు ప్రసాద్ పేరిట పట్టా చేయించాడు.

కళ్యాణదుర్గం: ఏ గ్రామంలోనైనా రోడ్లు, వంకలు, వాగులు, కుంటలు, కాలువలు, ఇళ్లు, బీడు భూములు అన్నీ ప్రభుత్వ ఆధీనంలో ఉంటాయి. అయితే శెట్టూరు మండలం అయ్యగార్లపల్లి అందుకు భిన్నం. పైవన్నీ ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తుల పేర్ల మీద రైత్వారీ పట్టాలుగా ఉన్నాయి. ఇదంతా గ్రామానికి చెందిన సుధాకర్‌శెట్టి అనే వ్యక్తి తన కుటుంబ సభ్యులు, గ్రామానికి సంబంధంలేని బంధువుల పేర్ల మీద గ్రామస్తులకు తెలియకుండానే గుట్టుగా పట్టాలు చేయించుకున్నారు. ఇదంతా తెలిసిన గ్రామస్తులు ఆందోళనకు దిగారు. కొన్నేళ్లుగా న్యాయపోరాటం చేస్తూనే ఉన్నారు. ‘శోత్రియం’ కుటుంబీకులమంటూ సుధాకర్‌శెట్టి చెప్పుకుంటూ గ్రామస్తులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాడు. అయ్యగార్లపల్లిలో జరిగిన భూ మాయపై ‘సాక్షి’ లోతుగా అధ్యయనం చేయగా.. పలు ఆసక్తికర విషయాలు వెలుగుచూశాయి.

పూర్వ శోత్రియందారులు వీరే...

అయ్యగార్లపల్లి పూర్వం శోత్రియం గ్రామంగా ఉండేది. వేలాది ఎకరాల భూములు ముగ్గురు శోత్రియందారుల పేరు మీదే ఉండేవి. ఇందులో ఒకరు బెస్తరపల్లి రమణప్పశెట్టి, ఇంకొకరు మాకొడికి వీరారెడ్డి, మరొకరు అయ్యగార్లపల్లి శేషప్ప. వీరి నుంచి శెట్టూరులో కొందరికి హక్కు ఉండేది.

శ్రోతియభూములపై కన్నుపడిందిలా..

అయ్యగార్లపల్లి శోత్రియం భూములపై సుధాకర్ శెట్టి కన్ను పడింది. ఎలాగైనా భూములను తన స్వాధీనంలోకి తెచ్చుకోవాలని అసలైన శోత్రియందారులను అప్పట్లో భయభ్రాంతులకు గురి చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో ఇళ్లు, రోడ్లు, కాలువ, వంకలను సైతం వదల్లేదు. రైత్వారీ పట్టాలతో యథేచ్ఛగా క్రయవిక్రయాలు సాగించారు. ప్రశ్నించిన వారికి కోర్టు ద్వారా నోటీసులిచ్చి భయపెడుతున్నాడని గ్రామస్తులు చెబుతున్నారు.

తప్పుదోవ పట్టించి.. రైత్వారీ పట్టాలు పొంది..

సుధాకర్‌శెట్టి భూదాహం టీడీపీ హయాంలో తీరింది. శోత్రియం కుటుంబీకులమని అధికారులనే తప్పుదోవ పట్టించి వందల ఎకరాలను తన కుటుంబీకుల పేరిట రైత్వారీ పట్టాలు చేయించుకున్నాడు. విచ్చలవిడిగా పట్టాదారు పాసుపుస్తకాలు చేయించుకున్నాడు. నేటికీ గ్రామంలో సాగులో ఉన్నది ఒకరు కాగా.. పట్టా మరొకరి పేరుపై ఉంది.

గ్రామస్తుల తిరుగుబాటు

కుటుంబ సభ్యుల పేరిట అక్రమంగా వందల ఎకరాల భూములకు పట్టాలు చేయించుకున్న సుధాకర్ శెట్టిపై అయ్యవారిపల్లి గ్రామస్తులు తిరగబడ్డారు. కొన్నేళ్లుగా న్యాయపోరాటం చేస్తున్నారు. గ్రామస్తుల ఫిర్యాదుల నేపథ్యంలో అధికారులు విచారణ చేపట్టారు. తాను పట్టా చేయించుకున్న భూములను తిరిగి ఇస్తానని అధికారుల సమక్షంలో సుధాకర్‌శెట్టి ఒప్పుకున్నాడు. అయితే మాటపై నిలబడలేదు. ఇక్కడే ఉంటే భూములన్నీ లాక్కుంటారని భావించి ఊరు విడిచివెళ్లిపోయాడు. గ్రామస్తుల తిరుగుబాటు నేపథ్యంలో తలొగ్గిన సుధాకర్‌శెట్టి అక్టోబర్ ఐదో తేదీన గ్రామ పెద్దల సమక్షంలో తన తల్లి కె.సుమిత్రమ్మ పేరున ఉన్న సర్వే నంబరు 173లోని 16.43 ఎకరాలు, 179–2లోని 0.68 ఎకరాలను గ్రామ పంచాయతీ పేరిట రిజిస్ట్రేషన్ చేయించారు.

వందల ఎకరాలు ఎలా వస్తాయి?



సుధాకర్ శెట్టి వాళ్లు శోత్రియం కుటుంబీకులే కాదు. అలాంటప్పుడు వందల ఎకరాలు ఒకే కుటుంబానికి ఎలా వస్తాయి? గత టీడీపీ హయాంలో పనిచేసిన రెవెన్యూ అధికారులు ఎలా పట్టాలిచ్చారు? కనీసం మా ఊరు కాని వారికి కూడా పదుల సంఖ్యలో భూములకు పట్టాలిచ్చారు. మా భూములు మాకు తిరిగివ్వాలని అడిగితే మాపైనే దౌర్జన్యం చేస్తున్నారు.
– మంజప్ప, స్థానికుడు, అయ్యగార్లపల్లి

మాట తప్పి.. ఊరు విడిచాడు



ఊర్లో మాకే తెలియకుండా మా ఇళ్లు, పొలాలు, వంకలు, వాగులు అన్నీ సుధాకర్ శెట్టి ఇంట్లో వాళ్ల పేరిట పట్టాలు తీసుకున్నాడు. గ్రామస్తులంతా భూములు వెనక్కు ఇవ్వాలని అడిగితే అధికారుల సమక్షంలో ఇస్తామని చెప్పి ఊరు విడిచి పోయారు.
– పూజారి పాలయ్య, అయ్యగార్లపల్లి

ఉన్నతాధికారులకు నివేదించాం



అయ్యగార్లపల్లిలో రైత్వారీ పట్టాలన్నీ గతంలోనే జారీ అయ్యాయి. ఇక్కడ జరిగిన భూ అక్రమాలపై ఉన్నతాధికారులకు కూడా విన్నవించాం.
– ఫణికుమార్, తహసీల్దార్, శెట్టూరు

సుధాకర్‌శెట్టి కుటుంబం పొందిన భూములివే..

అయ్యగార్లపల్లిలో దాదాపు 200 ఎకరాలకు సుధాకర్ శెట్టి కుటుంబ సభ్యులు, బంధువుల పేరిట పట్టాలు పొందారు. ఇందులో సర్వే నంబరు 4–1లో 20.02 ఎకరాల బంజరు భూమికి సుధాకర్‌శెట్టి తల్లి కె.సుమిత్రమ్మ రైత్వారీ పట్టా కోసం దరఖాస్తు చేసుకున్నారు. సర్వే నంబరు 16లో గ్రామస్తులు సాగు చేసుకుంటున్న 11.23 ఎకరాలను సుధాకర్‌శెట్టి సోదరుడు కె.రాధాకృష్ణ అనంతపురానికి చెందిన వ్యక్తికి అమ్మేశాడు. సర్వేనంబరు 209–2లో 20 మంది వడ్డే, బొమ్మలాట, ఎస్సీ కులస్తులు డీ పట్టాలు పొందితే.. అదే భూమిపై సుధాకర్‌శెట్టి వదిన అయిన రాచమడుగు వరలక్ష్మి పేరిట రైత్వారీ పట్టా పొందారు. సర్వేనంబరు 285లో ఇతరులు సాగు చేస్తున్న 28.27 ఎకరాలపై సుధాకర్‌శెట్టి తమ్ముడు కె.రాధాకృష్ణ రైత్వారీ పట్టా పొందాడు.సర్వేనంబరు 287లో 16 మంది రైతులకు డీ పట్టా ఇచ్చిన 31.87 ఎకరాల భూమిని సుధాకర్‌శెట్టి బామ్మర్ది అశ్వత్థనారాయణ పేరుపైకి మార్చేశారు. సర్వేనంబరు 180లోని అయ్యగార్లపల్లి – తిప్పనపల్లి ప్రధాన రహదారి ఉన్న 1.36 ఎకరాలకు పట్టా మంజూరు చేయాలని కె.సుమిత్రమ్మ దరఖాస్తు చేసుకున్నారు. సర్వేనంబరు 158–1, 158–2లోని 34.24 ఎకరాల భూమి సుధాకర్‌శెట్టి భార్య శశికళ పేరుపై ఉంది. సర్వే నంబరు 139–1లో 2.52 ఎకరాల విస్తీర్ణంలో 30 మంది బీసీలకు ఇటీవల ఇంటి పట్టాలివ్వగా.. రికార్డుల్లో సుధాకర్‌శెట్టి సోదరుడు రాధాకృష్ణ పేరుంది. సర్వేనంబరు 207లోని 20.66 ఎకరాల మిగులు భూమి, 247–2లోని 1.16 ఎకరాల భూమి అనంతపురానికి చెందిన నారాయణస్వామి పేరిట ఉంది.



అధికారుల సమక్షంలో భూములు తిరిగిస్తానని ఒప్పుకున్న సుధాకర్ శెట్టి, అతని సోదరుడు రాధాకృష్ణ (వృత్తంలో వ్యక్తులు)

పోలీసు అమరవీరుల ఆశయ సాధనకు కృషి

అనంతపురం క్రైం: పోలీసు అమరవీరుల ఆశయ సాధనకు కృషి చేస్తామని డీఐజీ ఆర్‌ఎన్ అమ్మిరెడ్డి, ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు మంగళవారం ముగిశాయి. చివరి రోజు డీఐజీ, ఎస్పీ నేతృత్వంలో సిబ్బంది అంబేడ్కర్ సర్కిల్ నుంచి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. సప్తగిరి సర్కిల్‌లోని పోలీసు అమర వీరుల స్మారక చిహ్నం వద్ద పోలీసు అధికారులు, సిబ్బంది, నగర వాసులు నివాళులర్పించారు. అనంతరం క్లాక్ టవర్ వద్ద మానవహారంగా ఏర్పడి పోలీసు అమర వీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా డీఐజీ, ఎస్పీ మాట్లాడుతూ విధినిర్వహణలో ప్రాణ త్యాగం చేసిన పోలీసుల ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు విజయభాస్కర్‌రెడ్డి, ఎ.హనుమంతు, ఏ.ఆర్ డీఎస్పీ మునిరాజు, సీఐలు ప్రతాప్‌రెడ్డి, రెడ్డెప్ప, శివరాముడు, వెంకటేష్ నాయక్, దేవానంద్, మోహన్, ఆర్ఐలు హరికృష్ణ, రాముడు, పలువురు ఆర్ఎస్ఐలు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహాక్ కమిటీ సభ్యులు త్రిలోక్, సుధాకర్‌రెడ్డి, గాండ్ల హరినాథ్, తేజ్‌పాల్, పోలీసు అధికారులు, సిబ్బంది, వివిధ పాఠశాలల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా వక్తృత్వపు పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు డీఐజీ, ఎస్పీ బహుమతులు ప్రదానం చేశారు.

తీవ్రమైన కేసుల్లో జాప్యం వద్దు

తీవ్రమైన కేసులను త్వరగా ఛేదించాలని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలోని కాన్ఫరెన్స్ హాలులో ఎస్ఐ, ఆపై స్థాయి పోలీసు అధికారులతో ఎస్పీ నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. తొలుత దివంగత మాజీ ఉప ప్రధాని, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి సీఐలు, ఎస్ఐలతో కలిసి ఎస్పీ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రేవ్ కేసులు, శాంతి భద్రతల పరిరక్షణ, తదితర అంశాలపై ఎస్పీ సమీక్షించారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించే దిశగా సంబంధిత శాఖలతో కలసి పని చేయాలన్నారు. రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లపై ప్రత్యేక నిఘా వేయాలన్నారు. సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. గ్రేవ్ కేసుల్లో ముద్దాయిలకు తప్పనిసరిగా శిక్షలు పడేలా చర్యలుండాలన్నారు. ఫ్యాక్షన్ ప్రభావిత, సమస్యాత్మక ప్రాంతాల్లో చిన్న సమస్యలు సైతం తలెత్తకుండా అప్రమత్తంగా పని చేయాలన్నారు. ప్రాపర్టీ నేరాల నియంత్రణపై దృష్టి సారించాలన్నారు. చోరీ కేసుల్లో రికవరీలు పెంచాలన్నారు. ఇసుక, అక్రమ మద్యం, గంజాయిలాంటి అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. మట్కా, పేకాట, క్రికెట్ బెట్టింగులను పూర్తిగా కట్టడి చేయాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీలు ఆర్ విజయ భాస్కర్‌రెడ్డి (అడ్మిన్) జి.రామకృష్ణ (సెబ్), ఎ.హనుమంతు (ఏఆర్), డీఎస్పీలు ఎం.ఆంథోనప్ప, బి.శ్రీనివాసులు, గంగయ్య, యు.నరసింగప్ప, జి.ప్రసాదరెడ్డి, బి.వి.శివారెడ్డి, జిల్లా పోలీసు కార్యాలయ పరిపాలన అధికారి శంకర్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న డీఐజీ, ఎస్పీ, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది

రబీ పంటలకు బీమా

- ‘అనంత’లో ఏడింటికి ఉచిత పంటల బీమా
- శ్రీసత్యసాయి జిల్లాలో మూడు పంటలకు..
- గ్రామం యూనిట్‌గా పప్పుశనగకు వర్తింపు
- పప్పుశనగ హెక్టారుకు రూ.75 వేలు ఖరారు
- అరటి, టమాట పంటలకు బీమా అమలు

అనంతపురం అగ్రికల్చర్: వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాలు రబీకి వర్తింపజేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అనంతపురం జిల్లాలో ఏడు పంటలకు, శ్రీసత్యసాయి జిల్లాలో మూడు పంటలకు బీమా అమలు చేస్తున్నారు. అందులో వాతావరణ బీమా కింద అనంతపురం జిల్లాలో అరటి, టమాటకు ఇవ్వగా.. శ్రీసత్యసాయి జిల్లాలో టమాటకు వర్తింపజేశారు. వర్షపాతం, ఉష్ణోగ్రతలు, వాతావరణ గణాంకాలు ఆధారంగా వీటికి బీమా పరిహారం లెక్కిస్తారు. టమాటను డిసెంబర్ 15 నుంచి 2024 ఫిబ్రవరి 28 వరకు రిస్క్ పీరియడ్‌గా గుర్తించారు. అరటికి జూలై 1 నుంచి 2024 మే 31వ తేదీ వరకు పరిగణిస్తారు. గాలిలో తేమశాతం, అధిక వర్షపాతం, అధిక ఉష్ణోగ్రతలు, అధిక గాలివేగం లాంటి నాలుగు కేటగిరీల కింద ఆటోమేటిక్ వెదర్‌స్టేషన్లలో నమోదైన గణాంకాలను బట్టి బీమా పరిహారం లెక్కించనున్నారు. అరటి హెక్టారుకు రూ.1.50 లక్షలు, టమాటాకు రూ.80 వేలుగా ఖరారు చేశారు. అనంతపురం జిల్లాలో బజాజ్ అలయెంజ్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ, శ్రీసత్యసాయి జిల్లాలో హెచ్‌డీఎఫ్‌సీ ఇన్సూరెన్స్ కంపెనీకి అమలు చేసే బాధ్యతలు అప్పగించారు.



పప్పుశనగ పంట

- ఇక ఫసల్‌బీమా కింద అనంతపురం జిల్లాలో రబీకి గ్రామం యూనిట్‌గా పప్పుశనగకు వర్తింపజేయగా, మండలం యూనిట్ కింద వరి, జొన్న, మొక్కజొన్న, వేరుశనగ పంటకు ఇచ్చారు. శ్రీసత్యసాయి జిల్లాలో మండలం యూనిట్‌గా వరి, వేరుశనగకు బీమా అమలు చేస్తారు. పప్పుశనగ హెక్టారుకు రూ.75 వేలు, వరికి రూ.లక్ష, జొన్నకు రూ.50 వేలు, మొక్కజొన్నకు రూ.80 వేలు, వేరుశనగకు రూ.70 వేలు బీమా పరిహారం ఖరారు చేశారు. ప్రణాళికశాఖ నిర్వహించే పంట కోత ప్రయోగాలు, వాటి దిగుబడుల ఆధారంగా లెక్క వేయనున్నారు. అది కూడా గత ఏడేళ్ల కాలంలో వచ్చిన దిగుబడుల్లో సగటున ఐదేళ్ల దిగుబడులు తీసుకుంటారు. దానికి ఈ సంవత్సరం వచ్చిన దిగుబడులను పరిగణనలోకి తీసుకుని పరిహారం లెక్క కడతారు. అన్నింటికీ నేషనల్ క్రాప్ ఇన్సూరెన్స్ పోర్టల్‌లో ఈ–క్రాప్, ఈ–కేవైసీ, సామాజిక తనిఖీ వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. మొత్తం మీద ఫసల్‌బీమా కింద అనంతపురం జిల్లాలో రబీకి ఏడు పంటలకు ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీకి, శ్రీసత్యసాయి జిల్లాలో మూడు పంటలకు ఓరియెంటల్ ఇన్సూరెన్స్ కంపెనీకి వైఎస్సార్ ఉచిత పంటల బీమా అమలు చేసే బాధ్యతలు అప్పగించారు.

లక్ష్యాలు పూర్తి చేయాలి

అనంతపురం అర్బన్: జన్ సురక్ష క్యాంపెయిన్, ఘర్ ఘర్ కేసీసీ అభియాన్, జగనన్న తోడు కింద 8వ విడత రుణాల మంజూరు, పశు కిసాన్ క్రెడిట్ కార్డ్ రుణాలకు సంబంధించిన లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ గౌతమి బ్యాంకర్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ప్రత్యేక జిల్లా సంప్రదింపుల కమిటీ (స్పెషల్ డిస్ట్రిక్ కన్సల్టేటివ్ కమిటీ) సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో జన్ సురక్ష క్యాంపెయిన్‌ను డిసెంబర్ 31 వరకు నిర్వహించాలన్నారు. ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (పీఎంజేజేబీవై) కింద రెండో విడతలో జిల్లాకు నిర్దేశించిన 24,146 మందికి బీమా లక్ష్యం అధిగమించాలన్నారు. ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన (పీఎంఎస్‌బీవై) కింద రెండో విడతలో జిల్లాకు 77,242 మందికి బీమా లక్ష్యం కేటాయించామన్నారు. బ్యాంకులు లక్ష్యాలకు అనుగుణంగా క్యాంపెయిన్ చేపట్టి సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఘర్ ఘర్ కేసీసీ అభియాన్ పరిధిలో అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకూ మూడు నెలలు క్యాంపెయిన్ చేపట్టి పీఎం కిసాన్ లబ్ధిదారులకు స్యాచురేషన్ డ్రైవ్ పెట్టి కేసీసీ ప్రక్రియ చేయించాలన్నారు. జగనన్న తోడు, పీఎం స్వానిధి పథకం కింద 8వ దశలో డీఆర్‌డీఏ పరిధిలో 12,309 మంది లబ్ధిదారులకు, మెప్మా పరిధిలో అర్హులైన 6,289 మంది వీధి విక్రేతలకు రుణాలను మంజూరు చేసి నెల రోజుల్లోగా లక్ష్యాలను చేరుకోవాలన్నారు. పశు కిసాన్ క్రెడిట్ కార్డ్ (పీకేసీసీ) రుణాలకు సంబంధించి లక్ష్యానికి అనుగుణంగా, ఇప్పటివరకు 14,504 దరఖాస్తులను బ్యాంకులకు పంపించారన్నారు. సమావేశంలో ఎల్‌డీఎం సత్యరాజ్, నాబార్డ్ ఏడీఎం అనురాధ, ఏడీసీసీ బ్యాంకు సీఈఓ సురేఖారాణి, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, మెప్మా పీడీ విజయలక్ష్మి, పశుసంవర్ధక శాఖ జేడీ సుబ్రహ్మణ్యం, డీఎల్‌డీఓ ఓబులమ్మ, బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం, ఏఎల్‌డీఓ మానసశ్వేత తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

మద్దతు ధరతో చిరుధాన్యాల సేకరణ

అనంతపురం అర్బన్: బియ్యం కార్డుదారులకు చిరుధాన్యాలను పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ తెలిపారు. ఈ నేపథ్యంలో రైతుల నుంచి చిరుధాన్యాలను పౌర సరఫరాల సంస్థ ద్వారా సేకరించేందుకు చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలో రైతులు స్థానికంగా పండించిన చిరుధాన్యాలు రాగులు, జొన్నలు, కొర్రలను మద్దతు ధరతో సేకరించనున్నామన్నారు. క్వింటాలు రాగులు రూ.3,846, జొన్నలు రూ.3,180, కొర్రలు రూ.2,500, కందులు రూ.7,000 ధరతో కొనుగోలు చేస్తామన్నారు. పంట విక్రయించే రైతులు ఈ–క్రాప్ నమోదు చేసుకుని ఉండాలన్నారు. చిరుధాన్యాల సేకరణ ప్రభుత్వ నేరుగా రైతుల కళ్లాలు (పొలం) నుంచి కొనుగోలు చేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు ఆర్‌బీకేలో పేరు నమోదు చేసుకుని సహకరించాలని జాయింట్ కలెక్టర్ కోరారు.

మొదలైన పంట కోత ప్రయోగాలు

- 14 పంటల్లో 488 ప్రయోగాలు

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్‌లో సాగైన పంటల ద్వారా దిగుబడులు అంచనా వేయడానికి ప్రణాళిక శాఖ, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో పంట కోత ప్రయోగాలు మొదలయ్యాయి. ఈ–క్రాప్ ఆధారంగా జగన్ సర్కారు గత నాలుగేళ్లుగా వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాలు అమలు చేస్తూ పెద్ద ఎత్తున పరిహారం కూడా ఇస్తుండటంతో పంట కోత ప్రయోగాలకు అత్యంత ప్రాధాన్యత ఏర్పడింది. కొన్ని పంటలకు వాతావరణ బీమా, మరికొన్ని పంటలకు దిగుబడుల ఆధారంగా ఫసల్‌బీమా అమలు చేస్తున్న విషయం తెలిసిందే. అందులో కొన్ని పంటలకు గ్రామం యూనిట్‌గా, మరికొన్ని పంటలు మండలం యూనిట్‌గా, ఇంకొన్ని పంటలు జిల్లా యూనిట్‌గా తీసుకున్న నేపథ్యంలో పంట కోతలకు ప్రాముఖ్యత నెలకొంది. ఈ క్రమంలో ఎంపిక చేసిన గ్రామాలు, సర్వే నంబర్ల పంట పొలాల్లో నిర్ణీత కొలతల్లో పంట తొలగించి వాటి దిగుబడులను పారదర్శంగా లెక్కించి నమోదు చేయనున్నారు. 14 పంటల్లో 488 ప్రయోగాలు నిర్వహించడానికి ప్రణాళిక రూపొందించినట్లు సీపీఓ అశోక్‌కుమార్ మంగళవారం ‘సాక్షి’కి తెలిపారు. 488 ప్రయోగాలకు సంబంధించి 239 ప్రయోగాలు ప్రణాళికశాఖకు చెందిన ఏఎస్‌ఓలు చేయనున్నారు. 231 ప్రయోగాలు వ్యవసాయశాఖకు చెందిన ఏఈఓలు, మరో 18 ప్రయోగాలు ఉద్యానశాఖ అధికారులు నిర్వహించి దిగుబడులు అంచనా వేయనున్నారు. ప్రయోగాలన్నింటినీ క్రోడీకరించి ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వానికి పంపనుంది. వేరుశనగ పంటలో అత్యధికంగా 154, పత్తిలో 61, కందిలో 60, వరిలో 48, జొన్నలో 18, సజ్జలో 12,మొక్కజొన్నలో 36, పెసరలో 13,ఉలవలో 13, ఆముదంలో 18, ఎండుమిరపలో 18, సోయాబీన్‌లో 10, పొద్దుతిరుగుడులో 13 పంట కోత ప్రయోగాలు నిర్వహించనున్నారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో పంట కోతలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

జాతీయ సమైక్యతకు పాటుపడదాం : డీఆర్ఎం


రాష్ట్రీయ ఏక్తాదివస్ సందేశాన్ని వినిపిస్తున్న డీఆర్ఎం మనీష్ అగర్వాల్

గుంతకల్లు: జాతీయ సమైక్యతకు అందరూ కట్టుబడి దేశ సమగ్రత ప్రగతికి తోడ్పడాలని డీఆర్ఎం మనీష్‌అగర్వాల్ పిలుపునిచ్చారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా మంగళవారం డీఆర్ఎం కార్యాలయంలో అధికారులు, ఉద్యోగులతో రాష్ట్రీయ ఏక్తాదివస్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు సూర్యనారాయణ, సుధాకర్, సీనియర్ డీపీఓ జయశంకర్‌చౌహాన్, సీనియర్ డీసీఎం మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలకు ఆహ్వానం

అనంతపురం కల్చరల్: భీమవరానికి చెందిన డాక్టర్ ఉమర్ అలీషా సాహితీ సమితి ఆధ్వర్యంలో నిర్వహించబోయే రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలకు ఔత్సాహికుల నుంచి ఎంట్రీలను స్వీకరిస్తున్నారు. ఈ మేరకు సమితి ప్రతినిధి త్సవటపల్లి మురళీకృష్ణ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. బ్రహ్మశ్రీ ఉమర్ అలీషా రచించిన 'స్వర్గమాత' విశిష్టతను తెలియజేస్తూ వయసుతో నిమిత్తం లేకుండా ఎవరైనా వ్యాసాలను రచించి పంపవచ్చు. విజేతలకు జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేస్తారు. వివరాలకు 99894 87098లో సంప్రదించవచ్చు.

సంతృప్తికర స్థాయిలో వైద్య సేవలు

- జగనన్న ఆరోగ్య సురక్ష రీషెడ్యూల్
- కలెక్టర్ గౌతమి

అనంతపురం కార్పొరేషన్: ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తున్నామని, ప్రజలకు పూర్తి సంతృప్తికర స్థాయిలో వైద్య సేవలందించేలా కార్యక్రమాన్ని రీ షెడ్యూల్ చేసినట్లు కలెక్టర్ గౌతమి పేర్కొన్నారు. అనంతపురంలోని ఎర్రనేల కొట్టాల వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డితో కలసి ఆమె పరిశీలించారు. ప్రజలకందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం మీడియాతో ఆమె మాట్లాడారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకూ 392 జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను విజయవంతంగా నిర్వహించినట్లు గుర్తు చేశారు. ఆరోగ్య శ్రీ సేవలను సద్వినియోగం చేసుకునేలా ప్రజలు తమ మొబైళ్లలో ఆరోగ్యశ్రీ సిటిజన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఇప్పటి రవకూ జిల్లాలో 6.20 లక్షల కుటుంబాలకుగానూ 3 లక్షల కుటుంబాలు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నాయన్నారు.


వైద్యసేవలపై ఆరా తీస్తున్న కలెక్టర్ గౌతమి (చిత్రంలో) ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి

ఓపీ 5734.. రెఫరల్ 45

జిల్లాలోని 11 ప్రాంతాల్లో మంగళవారం నిర్వహించఇన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో 5,734 మంది ఓపీ సేవలు అందుకున్నారని డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి పేర్కొన్నారు. ఇందులో వివిధ రకాల అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న 45 మందిని జిల్లా, నెట్‌వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేశారన్నారు. అలాగే బుధవారం ఉదయం అనంతపురంలోని అంబేడ్కర్‌నగర్, శ్రీనివాసనగర్, రాయదుర్గం శాంతినగర్, తాడిపత్రి పాతకోట, అనంతపురం రూరల్, శెట్టూరు వైఎస్సార్ పట్టణ, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

'ప్రైవేట్'లో ఆరోగ్యశ్రీ సేవల మెరుగుకు చర్యలు తీసుకోండి

ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవల మెరుగుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గౌతమికి అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి విన్నవించారు. గర్భిణులు, బాలింతలకు ఆశించిన స్థాయిలో ప్రైవేట్ ఆస్పత్రుల్లో సేవలు అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆరోగ్యశ్రీ కింద సాధారణ, సిజేరియన్ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం ఆరోగ్య శ్రీ సేవలను పెంచేలా మార్గదర్శకాలిస్తున్నా.. కొన్ని ఆస్పత్రుల నిర్వాహకులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. స్పందించిన కలెక్టర్ వెంటనే ఆరోగ్యశ్రీ డీసీ కిరణ్‌కుమార్‌రెడ్డితో మాట్లాడారు. అనంతరం సాయినగర్ మొదటి క్రాస్ సచివాలయం సమీపంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ భ్రమరాంబదేవి, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కరరెడ్డి, వాసంతి సాహిత్య, నగర పాలక సంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మి, అదనపు కమిషనర్ రమణారెడ్డి, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లాబేగ్, కార్పొరేటర్ లాలూ, బాలాంజినేయులు పాల్గొన్నారు.

టీబీ డ్యాంలో నీటిమట్టం తగ్గుముఖం



బొమ్మనహాళ్: ఉమ్మడి జిల్లాకు వరదాయినిగా ఉన్న కర్ణాటకలోని తుంగభద్ర జలాశయంలో నీటిమట్టం తగ్గుముఖం పట్టింది. గతేడాది ఇదే సమయానికి డ్యాంలో పూర్తి సామర్థ్యం మేరకు 105.065 టీఎంసీల నీరు నిల్వ ఉండేది. ఈ ఏడాది తీవ్ర వర్షాభావం కారణంగా ఆశించిన స్థాయిలో నీరు చేరలేదు. దీనికి తోడు కాలువలకు వదులుతున్న నీటితో పాటు ఆవిరి రూపంలో గాలిలో కలుస్తున్న నీటితో కలుపుకుని నీటిమట్టం క్రమంగా తగ్గుతోంది. మంగళవారం డ్యాంలో 1607.52 అడుగులతో 32.950 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. కాలువలకు 9,013 క్యూసెక్కుల నీరు వదులుతున్నారు. ఆంధ్ర సరిహద్దులో (105వ కిలోమీటర్ వద్ద) 1,740 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

పీఏబీఆర్‌కు తగ్గిన ఇన్‌ఫ్లో


రిజర్వాయర్‌లో నిల్వ ఉన్న నీరు

కూడేరు: మండలంలోని పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్)కు ఇన్‌ఫ్లో గణనీయంగా తగ్గింది. ప్రస్తుతం రోజూ 140 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో మాత్రమే తుంగభద్ర జలాశయం నుంచి అందుతోంది. రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన తాగునీటి పథకాలకు నీటి సరఫరా, నీటి ఆవిరి, లీకేజీ రూపంలో రోజుకు 155 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉంది. ఇన్‌ఫ్లో కంటే ఔట్‌ఫ్లో ఎక్కువగా ఉండడంతో రిజర్వాయర్‌లో నీటి మట్టం క్రమంగా తగ్గుముఖం పడుతోంది. మంగళవారం నాటికి రిజర్వాయర్‌లో 2.19 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఇరిగేషన్ జేఈఈఈలు లక్ష్మీదేవి, గంగమ్మ, రేణుక తెలిపారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

అనంతపురం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ మంగళవారం ముగిసింది. అనంత క్రీడాగ్రామంలోని ఫుట్‌బాల్ స్టేడియంలో చేపట్టిన అండర్–14 బాలికల జట్టు ఎంపికకు వివిధ ప్రాంతాలకు చెందిన 200 మంది క్రీడాకారిణిలు హాజరయ్యారు. వీరిలో ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రాతినిథ్యం వహించే జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఎంపికైన వారిలో జాబిత లహరి, ప్రణతి, తేజు, వర్ష, సాయి తనుశ్రీ, విష్ణు ప్రణవి, భూమిక, యామిని, చందన, పూజిత, స్నేహలత, రుచిత, అమృత, జ్యోత్స్న, ఇంద్రజ, లక్ష్మి, అనిత ఉన్నారు. ఎంపిక ప్రక్రియను ఉభయ జిల్లాల ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు బి.సుగుణమ్మ, అంజన్న, జిల్లా కో–ఆర్డినేటర్ ఎల్.నాగరాజు పర్యవేక్షించారు.


ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు



ఆటో డ్రైవర్‌పై కత్తితో దాడి

అనంతపురం క్రైం: నగరంలోని కోర్టురోడ్డులో మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు ఆటో డ్రైవర్ బాబావలిపై గుర్తు తెలియని వ్యక్తి కత్తితో దాడి చేశాడు. ఛాతిలోకి బలంగా పొడవడంతో తీవ్ర గాయమై బాబావలి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రుడిని 108 అంబులెన్స్ ద్వారా సర్వజనాస్పత్రికి తరలించారు. దాడికి దారి తీసిన కారణాలు తెలియాల్సి ఉంది. కాగా, ఘటనపై తమకు ఎలాంటి సమాచారం లేదని అనంతపురం రెండో పట్టణ పోలీసులు అన్నారు.

సర్దార్ స్ఫూర్తితోనే సమర్థ విధులు

- ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

అనంతపురం క్రైం: మాజీ ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ స్ఫూర్తితోనే రక్షణ బలగాలు దేశ అంతర్గత భద్రతను కాపాడుతున్నాయని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలో జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. బెలూన్లు, తెల్ల పావురాలను ఎగురవేశారు. అనంతరం దేశ సమైక్యత, సమగ్రతకు అంకితభావంతో పాటు పడదామని సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... స్వాతంత్య్రం అనంతరం 543 రాజరిక సంస్థానాలను భారత ప్రభుత్వంలోకి విలీనం చేయడానికి సర్దార్ చూపిన చొరవను కొనియాడారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలోని పోలీసు అమర వీరుల స్థూపం వద్ద 2కే రన్ ఫర్ యూనిటీని ఎస్పీ ప్రారంభించారు. అంబేడ్కర్ కూడలి, సప్తగిరి సర్కిల్, సుభాష్ రోడ్డు, క్లాక్ టవర్, కోర్టు రోడ్డు, పోలీసు పరేడ్ మైదానం వరకూ రన్ కొనసాగింది. కార్యక్రమంలో ఎస్పీ అన్బురాజన్, అదనపు ఎస్పీలు విజయభాస్కర్ రెడ్డి, హనుమంతు, ఏఆర్ డీఎస్పీ మునిరాజు, సీఐలు ప్రతాప్ రెడ్డి, రెడ్డప్ప, శివరాముడు, రామకృష్ణారెడ్డి, విశ్వనాథచౌదరి, వెంకటేష్ నాయక్, దేవానంద్, మోహన్, ఆర్ఐలు హరికృష్ణ, రాముడు, పలువురు ఆర్ఎస్ఐలు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు, అధికారులు, సిబ్బంది, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.


సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ అన్బురాజన్

కార్గో సేవలపై విస్తృత ప్రచారం

అనంతపురం సెంట్రల్: ఆర్టీసీలో సరుకు రవాణా (కార్గో), డోర్ డెలివరీ సదుపాయంపై విస్తృత ప్రచారం కల్పించాలని డిపో మేనేజర్లను జిల్లా ప్రజా రవాణా అధికారి సుమంత్.ఆర్.ఆదోని ఆదేశించారు. కార్గో సేవలపై జిల్లాలోని డిపో మేనేజర్లు, ట్రాఫిక్ ఇన్‌చార్జ్‌లతో మంగళవారం తన చాంబర్‌లో ఆయన సమీక్షించారు. కార్గో సేవలను అభివృద్ధి పర్చాలని, స్వీకరించిన వస్తువులను వెంటనే డెలివరీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదాల నియంత్రణపై ఎప్పటికప్పుడు డ్రైవర్లను చైతన్య పరుస్తూ ఉండాలన్నారు. వాహనాల బ్రేక్ డౌన్ తగ్గించి కేఎంపీఎల్ పెంచాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సీటీఎం రమేష్‌బాబు, డీసీఎం మోహన్‌కుమార్, డిపో మేనేజర్లు నాగభూపాల్, శంకర్, రామచంద్ర, సురేష్‌కుమార్, నారాయణస్వామి, ట్రాఫిక్ ఇన్‌చార్జ్‌లు వినయ్‌కుమార్, రమణమ్మ, ప్రసాద్, ఎస్‌టీఐ నాగార్జున, ఏఎంఎఫ్ సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రీ రిపబ్లిక్ పరేడ్ క్యాంప్‌కు ఎంపిక

అనంతపురం: ప్రీ రిపబ్లిక్ పరేడ్ క్యాంప్‌లో ప్రాతినిథ్యం వహించే జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలోని విద్యార్థుల ఎంపిక ప్రక్రియ మంగళవారం నిర్వహించారు. ఎంపికైన వారిలో షేక్ సనాఅంజుమ్, వై.యామిని (జేఎన్‌టీయూ(ఏ) క్యాంపస్), డీవీవీఎస్ చరిత (జేఎన్‌టీయూ–కలికిరి) ఉన్నారు. ఎంపికైన విద్యార్థులను జేఎన్‌టీయూ (ఏ) వీసీ డాక్టర్ జింకా రంగజనార్దన, రెక్టార్ ఎం.వి జయకుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్ అభినందించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.శారద, డాక్టర్ జి.మమత, డాక్టర్ డి.విష్ణువర్ధన్, డాక్టర్ దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన, డైరెక్టర్లు, ప్రొఫెసర్లు



యువకుడి ఆత్మహత్య

గుంతకల్లు టౌన్: కుటుంబసభ్యుల మందలింపుతో మనస్తాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుంతకల్లులోని ఆచారమ్మ కొట్టాలకు చెందిన వెంకట్రావు, పద్మావతి దంపతుల పెద్ద కుమారుడు రాహుల్ (29) ఎంబీఏ పూర్తి చేసి కొన్ని నెలల పాటు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేశాడు. మూడు నెలల క్రితం ఉద్యోగం మానేసి గుంతకల్లుకు చేరుకున్న రాహుల్ మద్యానికి బానిసగా మారి జులాయిగా తిరగడం మొదలు పెట్టాడు. ఈ క్రమంలో హైదరాబాద్‌కు వెళ్లి తమ్ముడితో కలసి ఏదో ఒక ఉద్యోగం చూసుకోవాలని సోమవారం రాత్రి రాహుల్‌ను తల్లిదండ్రులిద్దరూ మందలించారు. ఈ విషయంగా తల్లిదండ్రులతో గొడవపడిన రాహుల్... అనంతరం ఇంటిపైనున్న రేకుల్‌షెడ్‌లో నిద్రిస్తానంటూ వెళ్లి ఇనుపరాడ్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఉదయం ఈ విషయాన్ని గుర్తించిన తల్లిదండ్రుల రోదనకు అంతు లేకుండా పోయింది. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య అక్కడకు చేరుకుని పరిశీలించారు. తల్లి పద్మావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

సైన్స్ ల్యాబ్‌ల పరిశీలనకు స్పెషల్ టాస్క్‌ఫోర్స్

అనంతపురం ఎడ్యుకేషన్: పాఠశాలల్లోని సైన్స్ ల్యాబ్‌ల నిర్వహణను పరిశీలించేందుకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గురువారం నుంచి మూడు రోజుల పాటు స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పర్యటించనుంది. సైన్స్ బోధన–అభ్యసన కార్యకలాపాలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా అటల్ టింకరింగ్ ల్యాబ్స్, సైన్స్ టెక్నాలజీ ఇంజినీరింగ్ మాథ్స్ లాబ్స్, ఇంటరాక్టివ్ ఫ్లాట్ పానెల్స్, ఇన్‌స్పైర్ అవార్డుల ప్రదర్శనలు, నెహ్రూ బాలాల సైన్స్ ఫైర్స్, స్కూల్ ఇన్నోవేషన్ ప్రోగ్రామ్, రాష్ట్రీయ సైన్స్ ఫైర్స్, కౌశల్ క్విజ్ పోటీలు తదితర కార్యక్రమాలు చేపడుతోంది. విద్యార్థి దశ నుంచే శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేలా ఈ కార్యక్రమాలకు విద్యాశాఖ శ్రీకారం చుట్టింది. వీటన్నింటినీ పర్యవేక్షించేందుకు జిల్లాస్థాయిలో ప్రత్యేకంగా ఓ సైన్స్ అధికారిని నియమించారు. సైన్స్ పాఠాలు తరగతి గదిలో గాక, సైన్స్ లాబ్‌లోనే బోధించాలన్నది ప్రాథమిక సూత్రం. ప్రతి సైన్స్ ఉపాధ్యాయుడు పాఠ్యాంశానికి చెందిన ప్రయోగాలను, నమూనాలను అందుబాటులో ఉన్న వనరుల ద్వారా, తాను సొంతంగా తయారు చేసిన పరికరాల ద్వారా బోధించాలి. వీటి అమలును పరిశీలించడానికి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా మూడు టాస్క్ ఫోర్స్ బృందాలను నియమించింది. ప్రతి బృందంలో వేర్వేరు జిల్లాలకు చెందిన ముగ్గురు సైన్స్ అధికారులు సభ్యులుగా ఉంటారు. ప్రతి జిల్లాలో ఏటీఎల్, ఎస్‌టీఈఓఎమ్ లాబ్స్‌ను, ఉన్నత పాఠశాలలను మూడు రోజుల పాటు సందర్శించి అక్కడి సైన్స్ పాఠ్యాంశాల బోధనాభ్యసన, సైన్స్ ల్యాబ్‌ల వినియోగాన్ని క్షుణ్ణంగా పరిశీలించి నివేదికను విద్యాశాఖ కమిషనర్, సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్‌కు అందజేయనున్నారు. ఈ నేపథ్యంలో ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, సైన్స్, గణిత ఉపాధ్యాయులు తగిన రిజిస్టర్లను సిద్ధంగా ఉంచుకోవాలని డీఈఓ వి.నాగరాజు, జిల్లా సైన్స్ అధికారి బాలమురళీకృష్ణ తెలిపారు.

ఆముదం ఇగురు తిని 15 గొర్రెల మృతి

బెళుగుప్ప: మండలంలోని యలగలవంకలో ఆముదం ఇగురు తిన్న గొర్రెలు మృత్యువాతపడ్డాయి. గ్రామానికి చెందిన బోయ రమేష్ గొర్రెల పోషణతో జీవనం సాగిస్తున్నాడు. మంగళశారం గొర్రెలను మేపునకు పంట పొలాల్లోకి తోలుకెళ్లినప్పుడు పక్కనే ఉన్న ఆముదం పంటలోకి చొరబడి ఇగురు తిన్నాయి. దీంతో 15 గొర్రెలు మృతి చెందాయి. విషయం తెలుసుకున్న పశువైద్యాధికారి రమేష్ ఆ గ్రామానికి చేరుకుని అస్వస్థతకు గురైన గొర్రెలకు చికిత్స అందజేశారు. గొర్రెల కాపరికి ఉచితంగా మందులు అందజేసి, పలు సూచనలు చేశారు. మృతి చెందిన గొర్రెల విలువ దాదాపు రూ.2 లక్షలు ఉంటుందని ఈ సందర్భంగా కాపరి ఆవేదన్య వ్యక్తం చేశాడు.


మృతి చెందిన గొర్రెలను పరిశీలిస్తున్న డాక్టర్ రమేష్

'వందే భారత్'పై దాడి కేసులో దొరకని ఆనవాళ్లు

అనంతపురం సిటీ: కాచిగూడ–బెంగళూరు మధ్య నడిచే వందేభారత్ రైలుపై రాళ్ల దాడులకు సంబంధించిన కేసుల్లో ఎలాంటి పురోగతి లేదు. రాళ్లు రువ్విన దుండగుల ఆచూకీ ఇప్పటికీ చిక్కలేదు. సికింద్రాబాద్ నుంచి సీసీ కెమెరా ఫుటేజీలు తెప్పించుకొని అనంతపురం, హిందూపురం ఆర్‌పీఎఫ్ పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు వేగవంతం చేశారు. అయినా ఎలాంటి క్లూ దొరక్క పోవడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. గత నెల ఒకటిన ధర్మవరం సమీపంలో, అదే నెల 17న అనంతపురం శివారులో వందేభారత్ రైలుపై దుండగులు రాళ్లు రువ్విన సంగతి తెలిసిందే.



సాక్షి అనంతపురం

గురువారం । 2 । నవంబర్ । 2023



చీనీ టన్ను రూ.26 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.26 వేలు పలికాయి.



టమాట కిలో రూ.21

కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.21 పలికింది. కనిష్టం రూ.8, సరాసరి రూ.16 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
35.7°/20.2°

జిల్లా అంతటా బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేకువజామున చలి వాతావరణం కనిపించింది. తూర్పు దిశగా గంటకు 4 నుంచి 6 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

యశ్వంతపుర-బీదర్ మధ్య వీక్లీ రైళ్లు



యశ్వంతపుర-బీదర్ మధ్య నడిచే రైలు

అనంతపురం సిటీ: యశ్వంతపుర-బీదర్ మధ్య వచ్చే శని, ఆదివారం నుంచి వారాంతపు (వీక్లీ) రైళ్లు నడపనున్నట్లు అనంతపురం రైల్వే స్టేషన్ మేనేజర్ మాసినేని అశోక్‌కుమార్ బుధవారం తెలిపారు. యశ్వంతపురలో వచ్చే శనివారం రాత్రి 11.15 గంటలకు బయలుదేరే ఎక్స్‌ప్రెస్ (నంబర్: 16577) రైలు హిందూపురం, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, గుల్బర్గా మీదుగా బీదర్‌కు ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటలకు చేరుకుంటుందన్నారు. మార్గమధ్యంలో అనంతపురానికి తెల్లవారుజామున 4.38 గంటలకు వస్తుందని వివరించారు. తిరిగి ఆదివారం మధ్యాహ్నం 2.40 గంటలకు బీదర్‌లో బయలుదేరే రైలు (నంబర్: 16578) తిరిగి అదే మార్గంలో యశ్వంతపురకు రాత్రికి చేరుకుంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వైద్య శిబిరాలతో 'ఆరోగ్యమస్తు'



రాయదుర్గంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

అనంతపురం మెడికల్: తమ చెంతనే నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు ప్రజలు తరలివచ్చి వివిధ రకాల వైద్య పరీక్షలు చేయించుకుని, వైద్యం పొందుతున్నారు. బుధవారం జిల్లాలోని ఆరు ప్రాంతాల్లో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను నిర్వహించగా.. 3,074 మంది ఓపీ సేవలు వినియోగించుకున్నారు. కాగా వివిధ రకాల సమస్యలతో బాధపడుతున్న 475 మందిని స్పెషలిస్టు వైద్యులు జిల్లా ఆస్పత్రులకు రెఫర్ చేశారు. వైఎస్సార్ కంటి వెలుగు కింద 28 మంది వైద్యం పొందారు. డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి తాడిపత్రిలోని అంబేడ్కర్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో జరిగిన వైద్య శిబిరాలను పరిశీలించారు. గురువారం జిల్లాలో నాలుగు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ పేర్కొన్నారు.


ఆలస్యంగా నడిచిన ప్రశాంతి ఎక్స్‌ప్రెస్



బెంగళూరు-భువనేశ్వర్ మధ్య నడిచే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలు

అనంతపురం సిటీ: బెంగళూరు – భువనేశ్వర్ మధ్య నడిచే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలు (నంబర్ 18464) బుధవారం ఐదు గంటలు ఆలస్యంగా నడిచింది. ఈ రైలు మధ్యాహ్నం 1.45 గంటలకు బెంగళూరులో బయలుదేరాల్సి ఉండగా, సాయంత్రం 7 గంటలకు బయలుదేరింది. దీనికి ప్రధాన కారణం గుంటూరు డివిజన్‌లో పనులు జరుగుతున్న కారణంగా భువనేశ్వర్ నుంచి బయలుదేరిన రైలు బుధవారం ఉదయం 11.45 గంటలకు బెంగళూరుకు చేరుకోవాల్సి ఉండగా, సాయంత్రం 5.45కు చేరుకుంది. దీని ప్రభావం తిరుగు ప్రయాణంపై పడింది. ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలు ఐదు గంటలు ఆలస్యంగా రావడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

'నాసిన్'కు ఎయిర్‌బస్!



'నాసిన్' కొనుగోలుచేసిన విమానం

గోరంట్ల: పాలసముద్రం సమీపంలో ఏర్పాటు కాబోతున్న నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, ఇన్‌డైరెక్ట్ టాక్సెస్, నార్కోటిక్స్ సంస్థ (నాసిన్) ఎయిర్‌బస్‌ను కొనుగోలు చేసింది. అకాడమీలో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్టు ట్యాక్సెస్ (సీబీఐసీ) అనుబంధ ఏజెన్సీల అధికారులకు స్మగ్లింగ్ నిరోధక కార్యకలాపాలు, పేలుడు పదార్థాలను గుర్తించడంలో శిక్షణ ఇచ్చేందుకు ఎయిర్ బస్ కొనుగోలు చేసినట్లు సంస్థ ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో నిలిపి ఉంచిన ఎయిర్ ఇండియాకు చెందిన ఎయిర్ బస్సు (ఏ321 వీటీపీపీఎన్)ను అక్టోబర్ 10వ తేదీన నాసిన్ కొనుగోలు చేసిందన్నారు. ఆ తర్వాత ఎయిర్ బస్‌ను విడదీసి ట్రావెలర్ ద్వారా రోడ్డుమార్గం గుండా గురువారం పాలసముద్రానికి తీసుకురానున్నట్లు వెల్లడించారు.

పైపై పూత.. నిధుల మేత!

ముదిగుబ్బ బైపాస్ రోడ్డు పనుల్లో నాణ్యత నగుబాటుగా మారింది. పనులు దక్కించుకున్న నితిన్‌సాయి కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ నిబంధనలకు పాతరేస్తూ పైపై పూతలతో పనులు చేస్తోంది. రోడ్డు నిర్మాణంలో భాగంగా వేసిన బ్రిడ్జి పిల్లర్లు అప్పుడే బీటలు వారగా, కాంక్రీట్ వాల్ ఉబ్బిపోయింది. ఆమ్యామ్యాలకు అలవాటుపడిన అధికారులు కళ్లుమూసుకుని బిల్లులపై సంతకాలు చేసేస్తున్నారు.

నాసిరకంగా ముదిగుబ్బ బైపాస్ రోడ్డు పనులు

- ప్రజల భద్రత గాలికి వదిలిన 'నితిన్ సాయి' కంపెనీ
- బ్రిడ్జి కింది భాగం పిల్లర్లకు బీటలు
- బయటకు ఉబ్బిన ప్రీకాస్టెడ్ కాంక్రీట్ వాల్
- సిమెంట్‌తో మేకప్ చేస్తూ అక్రమాలు కప్పిపుచ్చుతున్న వైనం
- నాణ్యత పట్టించుకోకుండానే బిల్లులు చేస్తున్న అధికారులు



ముదిగుబ్బ బైపాస్ రోడ్డు పనులలో భాగంగా నూతనంగా నిర్మించిన బ్రిడ్జి కింది భాగంలో ఏర్పడ్డ పగుళ్లను సిమెంట్‌తో కప్పి పుచ్చిన దృశ్యం



బ్రిడ్జికి ఇరువైపుల ప్రీకాస్టెడ్ వాల్ ఉబ్బడంతో కనపడకుండా సిమెంట్‌తో కప్పివేసిన దృశ్యం

ధర్మవరం: ప్రజలకు మెరుగైన రహదారులు కల్పించి సుఖవంతమైన ప్రయాణం అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేంద్రాన్ని ఒప్పించి మరీ ముదిగుబ్బకు బైపాస్ రహదారిని మంజూరు చేయించారు. అందులో భాగంగా 2021 డిసెంబర్‌లో రూ.116.81 కోట్ల వ్యయంతో ముదిగుబ్బ నుంచి 7.749 కిలోమీటర్ల పొడవున ఎన్‌హెచ్–42 బైపాస్ రోడ్డును నిర్మించేలా టెండరు పిలిచారు. మాజీ ఎమ్మెల్యే వరదాపురం సూరికి చెందిన నితిన్‌సాయి కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ ఈ పనులు దక్కించుకుంది. నిబంధనలకు పాతరేస్తూ బైపాస్ రోడ్డు పనుల్లో అంతులేని అక్రమాలకు పాల్పడుతోంది.

నాణ్యత గాలికి..

బైపాస్ రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా నితిన్ సాయి కన్‌స్ట్రక్షన్స్ ఇటీవల నిర్మించిన బ్రిడ్జి పనులను చూస్తే నాణ్యత తేటతెల్లమవుతోంది. బ్రిడ్జి నిర్మాణంలో నిలువు కాంక్రీట్ వాల్ వద్ద పగుళ్లు ఏర్పడ్డాయి. నాసిరకం కాంక్రీట్ మిశ్రమం వాడటం వల్లే ఇలా జరిగిందని నిపుణులు చెబుతున్నారు. అలానే బ్రిడ్జి ఉపరితలంలో మట్టికట్ట పనులు లేయర్ల వారీగా సరిగా చేయక పోవడంతో ఇరువైపులా ఉన్న ప్రీకాస్టెడ్ కాంక్రీట్ వాల్ బయటకు ఉబ్బింది. దీంతో నాసిరకం పనులు ఎక్కడ బయటపడతాయోనని కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ సిమెంట్‌తో ప్లాస్టింగ్ చేసి మేకప్ చేసింది.

పట్టించుకోని అధికారులు..

ముదిగుబ్బ బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి నాసిరకంగా జరుగుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు. పైపెచ్చు పనుల నాణ్యతను పరిశీలించకుండానే విడతల వారీగా సదరు కంపెనీకి బిల్లులు మంజూరు చేస్తున్నట్లు తెలుస్తోంది. అధికారుల సైతం నితిన్ సాయి కన్‌స్ట్రక్షన్స్ కంపెనీతో లాలూచీ పడటంతోనే అవినీతి పెచ్చుమీరుతున్నట్లు తెలుస్తోంది.

సెంట్రల్ విజిలెన్స్‌కు ఎంపీ మాధవ్ ఫిర్యాదు

ముదిగుబ్బ బైపాస్ రోడ్డు నిర్మాణ పనులలో జరుగుతున్న అక్రమాలపై హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ సెంట్రల్ విజిలెన్స్ అధికారులకు లేఖ రాశారు. పనుల్లో అక్రమాలపై ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. బైపాస్ రోడ్డు, బ్రిడ్జి నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చూడాలని కోరారు.

'విజిలెన్స్'పై కంపెనీ ప్రతినిధుల దౌర్జన్యం

బైపాస్‌రోడ్డు నిర్మాణ పనులలో జరుగుతున్న అక్రమాలను విచారించేందుకు వెళ్లిన విజిలెన్స్ అధికారులపై గతంలో నితిన్‌సాయి కన్‌స్ట్రక్షన్ కంపెనీ ప్రతినిధులు దౌర్జన్యం చేశారు. విజిలెన్స్ అధికారుల ల్యాప్‌టాప్ ఎత్తుకెళ్లడంతో పాటు పనులు పరిశీలించకుండా అడ్డుకున్నారు. దీంతో అధికారులు సైతం నిస్సహాయ స్థితిలో ఉన్నారు. ఏది ఏమైనా ప్రజల భద్రతతో ముడిపడి ఉన్న ఈ వ్యవహారంలో ఉన్నతాధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి పనులు నాణ్యత జరిగేలా చూడాలని పలువురు కోరుతున్నారు. ఈ వ్యవహారంపై నేషనల్ హైవే ఈఈ మధుసూదన్‌ను వివరణ కోరేందుకు 'సాక్షి' ప్రయత్నించగా, ఆయన స్పందించలేదు.

'శోత్రియం'పై అధికారుల్లో గుబులు

సాక్షికి స్పందన
SAKSHI EFFECT

కళ్యాణదుర్గం: శోత్రియం పేరిట జరిగిన భూమాయ కలకలం రేపింది. శెట్టూరు మండలం అయ్యగార్లపల్లిలో జరిగిన శోత్రియం భూముల మాయపై 'సాక్షి'లో బుధవారం కథనం ప్రచురితమైంది. 2018లో రైత్వారీ పట్టాలపై సంతకాలు చేసిన తహసీల్దార్, రెవెన్యూ అధికారుల్లో గుబులు మొదలైంది. దీంతో పాటు నియోజకవర్గ స్థాయి పోలీసు, రెవెన్యూ అధికారులు సైతం 'సాక్షి' కథనంపై చర్చించుకున్నారు. అప్పట్లో పనిచేసిన రెవెన్యూ అధికారులు ప్రస్తుతం పలు మండలాల్లో విధుల్లో ఉండగా, అప్పట్లో రైత్వారీ పట్టాలిచ్చిన తహసీల్దార్ ప్రస్తుతం వాలంటరీ రిటైర్మెంట్‌లో ఉన్నారు. ఆయనతో కూడా కొందరు ఉద్యోగులు ఈ విషయంపై చర్చించినట్లు విశ్వసనీయ సమాచారం. అక్రమంగా మంజూరు చేసిన పట్టాలు రద్దు చేసి.. ఇదివరకు సాగులో ఉన్న, ఇళ్లు నిర్మించుకుని ఉన్న వారికి న్యాయం జరిగేదాకా తాము పోరాడతామని అయ్యగార్లపల్లి గ్రామస్తులు చెప్పారు.

నిర్ణీత పరీక్ష ఫీజు మాత్రమే వసూలు చేయాలి

అనంతపురం ఎడ్యుకేషన్: మార్చి–2024లో జరిగే పదో తరగతి పరీక్షలకు సంబంధించి అన్ని యాజమాన్యాల పాఠశాలలు విద్యార్థుల నుంచి నిర్ణీత ఫీజు మాత్రమే వసూలు చేయాలని డీఈఓ వి.నాగరాజు స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు పదో తరగతి రెగ్యులర్ విద్యార్థుల నుంచి పరీక్షల ఫీజు రూ.125 మాత్రమే వసూలు చేయాలని పేర్కొన్నారు. కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు రూ.500 – రూ.1000 దాకా వసూళ్లు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు కంటే రూపాయి అదనంగా వసూలు చేసినా సంబంధిత పాఠశాలల యాజమాన్యాలపై శాఖాపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

ఐదేళ్లలో తొలిసారి కరువు ఛాయలు

- నైరుతి నైరాశ్యంతో దుర్భిక్ష పరిస్థితులు
- 49 కరువు మండలాల ప్రకటన

అనంతపురం అగ్రికల్చర్: గత నాలుగేళ్లూ సమృద్ధిగా వర్షాలు కురిపించిన వరుణుడు ఐదో ఏడాది విరామం తీసుకున్నాడు. దీంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో కరువు ఛాయలు అలుముకున్నాయి. ఖరీఫ్ సేద్యానికి అత్యంత కీలకమైన నైరుతి రుతుపవనాలు ఏమాత్రమూ ప్రభావం చూపకపోవడంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. అనంతపురం జిల్లాలో జూన్ నుంచి సెప్టెంబర్ మధ్య నాలుగు నెలల ఖరీఫ్ కాలంలో 319 మి.మీ వర్షం పడాల్సి వుండగా 22.6 శాతం తక్కువగా 247.4 మి.మీ నమోదైంది. శ్రీసత్యసాయి జిల్లాలో కూడా 365.5 మి.మీ గానూ 16.7 శాతం తక్కువగా 297 మి.మీ నమోదైంది. దీంతో కరువు నెలకొంది. చంద్రబాబు పాలించిన 14 ఏళ్లలో వర్షాలు లేక, పంటలు పండక ఏకంగా 11సార్లు కరువు ఏర్పడింది. అప్పట్లో ప్రభుత్వం కంటితుడుపుగా ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వడం మినహా చేసిన సాయం చాలా తక్కువేనని రైతులు చెబుతున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రైతులకు అడుగడుగునా అండగా నిలిచారు. రైతు భరోసా, ఉచిత పంటల బీమా, ఇన్‌పుట్‌సబ్సిడీ, పంట రుణాలపై సున్నావడ్డీ, కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లు (సీహెచ్‌సీ) లాంటి కార్యక్రమాలు, పథకాలతో రైతు కష్టనష్టాల్లో వెన్నంటి ఉంటామని సర్కారు గత నాలుగేళ్లుగా భరోసా కల్పించింది. వర్షాభావ పరిస్థితుల కారణంగా కరువు నుంచి రైతును గట్టెక్కించేందుకు తాజాగా కరువు మండలాలను ప్రకటించింది.



కరువు జాబితాలో 49 మండలాలు

వర్షపాతం, అందులో వర్షపాత విరామాలు (డ్రైస్పెల్స్), సాగు చేసిన పంటల విస్తీర్ణం, భూగర్భజలాల లభ్యత, పంట దిగుబడుల అంచనా... తదితర కొలమానం ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలో 49 మండలాలను కరువు మండలాలుగా ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అందులో అనంతపురం జిల్లాలో బెళుగుప్ప, బొమ్మనహాళ్, యల్లనూరు మినహా మిగతా 28 మండలాలను తీవ్ర కరువు (సివియర్ డ్రాట్) జాబితాలో చేర్చింది. అలాగే శ్రీ సత్యసాయి జిల్లాలో 21 మండలాలను కరువు జాబితాలో చేర్చారు. అందులో ఎన్‌పీ కుంట, మడకశిర, అమరాపురం, గుడిబండ, రొళ్ల, అగళి, పరిగి... ఈ ఏడు మండలాలను తీవ్ర కరువు జాబితాలో చేర్చగా.. కనగానపల్లి, ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ, తలుపుల, బుక్కపట్నం, కొత్తచెరువు, రొద్దం, గోరంట్ల, సోమందేపల్లి, హిందూపురం, లేపాక్షి, చిలమత్తూరు ఈ 14 మండలాలను సాధారణ కరువు (మోడరేట్ డ్రాట్) మండలాలుగా ప్రకటించారు.

- ఉమ్మడి జిల్లాలో ఉన్న 63 మండలాల్లో 49 మండలాలు కరువు జాబితాలో చేరగా... మిగతా 14 మండలాల్లో కూడా పరిస్థితి అలాగే ఉన్నందున వాటిని కూడా కరువు జాబితాలో ప్రకటించాలని జిల్లా ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు వ్యవసాయశాఖ వర్గాలు తెలిపాయి. త్వరలో కరువు నివారణకు చర్యలు తీసుకోనున్నారు.

ఎంటెక్, ఎంఫార్మసీ ఫలితాల విడుదల

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో సెప్టెంబర్, అక్టోబర్ నెలలో నిర్వహించిన ఎంటెక్ రెండో సెమిస్టర్ (ఆర్–21), రెగ్యులర్, సప్లిమెంటరీ, ఎంటెక్ ఒకటి, మూడో సెమిస్టర్ (ఆర్–21, ఆర్–17) సప్లిమెంటరీ, ఎం ఫార్మసీ రెండో సెమిస్టర్ (ఆర్–21), మూడో సెమిస్టర్ (ఆర్–21, ఆర్–17), సప్లిమెంటరీ ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ.కేశవరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ బి.చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. ఫలితాలు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో చూడొచ్చని పేర్కొన్నారు.

పండుగలా పింఛన్ల పంపిణీ

అనంతపురం: వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ జిల్లాలో పండుగలా సాగింది. బుధవారం ఉదయం నుంచే వలంటీర్లు అవ్వాతాతలు, వితంతు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, వివిధ రకాల చేతి వృత్తిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ పంపిణీ చేపట్టారు. జిల్లాలో మొత్తం 2,87, 369 మంది లబ్ధిదారులు ఉండగా, తొలి రోజే 1,80,035 మందికి (77.40 శాతం) పింఛన్ అందజేశారు. ఠంచన్‌గా పింఛన్ అందడంతో లబ్ధిదారుల మోములో సంతోషం కనిపించింది.



అనంతపురం 44వ డివిజన్‌లో పింఛన్‌దారుతో బయోమెట్రిక్ వేయిస్తున్న వలంటీర్ శ్రీనివాసరావు

న్యాయం గెలిచిందా? రోగం గెలిచిందా?

- అనారోగ్య కారణాలతోనే బాబుకు బెయిలు
- స్కిల్ స్కాం కేసులో నిర్దోషని కోర్టు చెప్పలేదు
- రక్తాభిషేకం చేయడం రాక్షసత్వమే
- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

అనంతపురం టవర్‌క్లాక్: 'స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అరెస్ట్ అయ్యి రిమాండ్ ఖైదీగా జైలులో ఉన్న చంద్రబాబుకు కంటి చికిత్స కోసం హైకోర్టు కండీషన్లతో మధ్యంతర బెయిలు ఇచ్చింది. అయితే టీడీపీ నాయకులు న్యాయం గెలిచింది అంటూ సంబరాలు చేసుకుంటున్నారు. నిజంగా ఆయనకు సంబంధం లేకపోతే.. ప్రజాధనం దుర్వినియోగంలో పాత్ర లేకపోతే కేసు నుంచి ఎందుకు బయటపడలేదు.. ఎందుకు బెయిలు రాలేదు? కుంభకోణంలో అడ్డంగా దొరికిపోవడంతో అన్ని దారులూ మూసుకుపోయి.. చివరకు కంటి సమస్య కింద మధ్యంతర బెయిలు తెచ్చుకున్నారు. నిజాయితీ నిరూపించుకుని బెయిలుపై బయటికొచ్చారా.. లేక చికిత్స కోసం బయటకు రావడానికి బెయిలు తెచ్చుకోవడంలో గెలిచారా?' అని టీడీపీ శ్రేణులను రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ప్రశ్నించారు. బుధవారం ఆయన అనంతపురంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మీడియాతో మాట్లాడారు. కండీషన్లతో బెయిలు వచ్చినా టీడీపీ నాయకులు బాణాసంచా కాల్చుతున్నారని, ఇంకొందరు జంతుబలు ఇచ్చి సభ్యసమాజం తలదించుకునేలా వ్యవహరించారని అన్నారు. 73 ఏళ్ల వయస్సులో అనేక దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న చంద్రబాబుకు కంటి ఆపరేషన్ చేయించుకోవాల్సిన అవసరం ఉందని వైద్యులు ధ్రువీకరణపత్రం ఇవ్వడంతో 28 రోజుల పాటు బెయిల్ ఇచ్చారన్నారు. బెయిలు అంశంలో ఎక్కడా కేసు పూర్వాపరాల గురించి ప్రస్తావించలేదన్నారు. స్కాంలో చంద్రబాబు పాత్ర లేదనే విషయాన్ని ఎక్కడా వెల్లడించలేదన్నారు. బాబు జైలులో ఉంటే లోకేష్ ఆదేశాల మేరకు 54 రోజులపాటు టీడీపీ శ్రేణులు విజిల్స్ వేయడం, ప్లేట్లను గరిటెలతో కొట్టడం, కొవ్వొత్తుల ర్యాలీలు చేయడం వంటి విన్యాసాలు చేశారన్నారు. కండీషన్ బెయిలు మంజూరుతో ఎట్టకేలకు బలవంతపు నిరసనలు చేపట్టే పని తప్పిందని టీడీపీ శ్రేణులు సంతోషంతో బాణా సంచా పేలుస్తున్నాయని ఎద్దేవా చేశారు. బెయిలు మంజూరు నేపథ్యంలో టీడీపీ శ్రేణులు ఆత్మకూరు మండలం సిద్దరాంపురంలో జంతుబలి చేసి చంద్రబాబు చిత్రపటానికి రక్తాభిషేకం చేయడం హేయమైన చర్యగా అభివర్ణించారు. ఇలాంటి రాక్షసమైన పనులు చేయకుండా చంద్రబాబుపై నిజంగా అభిమానం ఉంటే దేవాలయాలకు వెళ్లి పూజలు చేసుకోవాలని హితవుపలికారు.

బాబు త్వరగా కోలుకోవాలి

ఎంపీ గోరంట్ల మాధవ్ చేసిన వ్యాఖ్యలను సైతం టీడీపీ వక్రీకరించిందని ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి మండిపడ్డారు. జగన్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని, దీంతో చంద్రబాబు రాజకీయంగా సమాధి అవుతారనే ఉద్దేశంతో మాట్లాడారన్నారు. చంద్రబాబు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

జిల్లాను ప్రగతి పథంలో నడిపిద్దాం



పొట్టి శ్రీరాములు, తెలుగుతల్లికి పుష్పాంజలి ఘటించిన కలెక్టర్ గౌతమి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఎస్పీ అన్బురాజన్, మేయర్ వసీం,



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

- అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులు
- రాష్ట్ర అవతరణ దినోత్సవంలో కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: సమష్టి కృషితో జిల్లాను ప్రగతిపథంలో నడిపిద్దామని కలెక్టర్ గౌతమి పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కోసం నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులని పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో రాష్ట్ర అవతరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి కలెక్టర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఏఆర్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ నేతృత్వంలోని సాయుధ దళం సమర్పించిన గౌరవ వందనాన్ని కలెక్టర్ స్వీకరించారు. అనంతరం రెవెన్యూ భవన్‌లో రాష్ట్ర అవతరణ వేడుకలు నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్, రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు (దేవదాయ) జ్వాలాపురం శ్రీకాంత్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్ అహమ్మద్, మేయర్ వసీం తదితరులు పాల్గొని పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. తెలుగుతల్లి చిత్రపటానికి వందనం సమర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ పొట్టిశ్రీరాములు ప్రాణత్యాగ ఫలమే రాష్ట్ర అవతరణ అన్నారు. అంతటి మహనీయున్ని స్మరించుకోవాల్సిన్వాన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మహనీయుల స్ఫూర్తితో జిల్లాను అభివృద్ధిపథంలో నడిపించడమే లక్ష్యంగా అందరూ పనిచేయాలన్నారు. ప్రజల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పలు పథకాలను ప్రవేశపెట్టిందన్నారు.

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు

ప్రత్యేక రాష్ట్రం కోసం ఆమరణ దీక్ష చేసి ప్రాణాలు అర్పించిన పొట్టి శ్రీరాములును స్మరించుకోవడం మన కర్తవ్యమని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. మహనీయుల స్ఫూర్తితో అభివృద్ధి, సంక్షేమం రెండుకళ్లుగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. మహాత్ములు కోరుకున్న సామాజిక న్యాయం, సమ న్యాయం అందిస్తూ పాలన సాగిస్తున్నారన్నారు. ఆయనకు మనమంతా అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమాదేవి, ఏడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ లిఖిత, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, డీఆర్‌ఓ గాయత్రీదేవి, అదనపు ఎస్పీలు విజయభాస్కర్‌రెడ్డి, హనుమంతు, సెబ్ ఏఎస్పీ రామకృష్ణ, ఆర్డీఓలు గ్రంధి వెంకటేశ్, రాణి సుస్మిత, సీపీఓ అశోక్‌కుమార్‌రెడ్డి, డిప్యూటీ కలెక్టర్ సుధారాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

రాష్ట్ర అవతరణ వేడుకల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. అనంతపురం డ్యాన్స్ స్టూడియో అర్జున్ భరద్వాజ్ నాట్య బృందం చేసిన భరతనాట్యం, కూడేరు కేజీబీవీ విద్యార్థినులు చేసిన 'నమో నమో జగతి ఆంధ్రప్రదేశ్' అంటూ చేసిన నృత్య ప్రదర్శన, అరవింద్ ఆర్ట్స్ అకాడమీ చిన్నారులు 'అదిగో అల్లదిగో '' అంటూ చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చిన చిన్నారులు, విద్యార్థినులను కలెక్టర్ అభినందించి, శాలువా, మెమెంటోతో సత్కరించారు.